అక్షర శక్తి

(గేయ సంపుటి)



రుద్రవరం ఎల్లయ్య

'అక్షరశక్తి'

(గేయ సంపుటి)

రుద్రవరం ఎల్లయ్య



గడిప సాయమ్మ ప్రచురణలు
రాయికల్ గ్రామం, సైదాపూర్ మండలం
కరీంనగర్ (జిల్లా)

అక్షరశక్తి

(గేయ సంపుటం)

రుద్రవరం ఎల్లయ్య

ఆగస్టు 1998

కవర్ డిజైన్ : అన్నవరం శ్రీనివాస్

ప్రతులు : 1000

ప్రతుల కొరకు :

ఆర్. ఎల్లయ్య
రిటైర్డ్ టీచర్
ఇ.నెం. 17-83/2
సాయమ్మ నిలయము
పోస్టు : హుస్నాబాద్ - 505 467
జిల్లా : కరీంనగర్ (ఆం.ప్ర)

వెల : రూ. **15-00**

ముద్రణ :

తిరుమల ప్రింటర్స్
13-39, ప్రగతి నగర్
హుస్నాబాద్ (పోస్టు) - 505 467
జిల్లా : కరీంనగర్
ఫోన్ : 55535 (08721)

''ఇది ప్రబోధ కవిత''

''చదువని వాడజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత కలుగున్'' అని పూర్వంలోనే విద్యా విలువను గుర్తించినారు. భర్తృహరి సుభాషిత త్రిశతిలో విద్యా మూల్యాన్ని చాటే అమూల్య శ్లోకాలున్నాయి. 'విద్య లేని వాడు వింత పశువు' అని మన జనం అంటూనే వున్నారు.

విద్యను ఇలా గొప్పదని చాటిచెప్తుతూనే మన పూర్వులు, ధర్మగ్రంథకర్తలు కొన్ని జాతుల వారిని చదువుకు దూరంగా ఉంచారు. మత ధర్మకర్తల సిద్ధాంతాన్ని అనాటి పెద్దలు శాసనాలు చేసి కఠినంగా అమలు పరిచారు. దీన శ్రామిక, దళిత జనం దాన్ని విధి లేక చచ్చినట్టు అనుసరించింది.

అట్టడుగు జాతి నుండి ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ స్థితికి ఎదిగిన ఎల్లయ్య ఇప్పటికి ఈ దేశంలో చదువురాని పామరులు కార్మిక, కర్షక, శ్రామిక, దళిత, పీడిత స్త్రీ జాతులలో ఉన్నారని, తలపోసి 'అక్షరశక్తి' అను కృతిని ప్రచురిస్తున్నారు. ముచ్చటైన ఈ కావ్యం ఎల్లయ్యగారి మూడవ కృతి. ఇందులో ఆయన తన కవిత్వ ప్రతిభ చాటుకోవడానికో, భాషా పాండిత్యాన్ని ప్రదర్శించడానికో ఈ కవితలు రాయలేదు. తన కవితావేశం చల్లార్చుకోడానికి రాశారు. ఇంకా అధ్యాపకుడు కాబట్టి ఆదర్శ ప్రబోధం కావిస్తూ ''అక్షరశక్తి''ని రచించారు.

నేటి పల్లెటూరి అనాగరిక జీవితాలకు, విద్యావంతులై ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ విలాసవంతమైన జీవితాలకు మధ్య ఎంత అంతరం? అందుకే బీదల బాధలు తొలగిపోవాలంటే పేద వాళ్ళందరూ తప్పక చదువుకోవాలని ప్రబోధం చేశారు - ఆదేశించారు.

ఇందులోని మరో ప్రధానాంశం రిజర్వేషన్‌ల పాట మానండని హితోపదేశం చేయడం! ఇది చాలా సాహసంతో కూడిన చర్య. శ్రీ ఎల్లయ్యగారి యొక్క విలువైన మాట. ''సమత కదా మనకు కావల్సింది?'' అనే ప్రశ్నాపూర్వక ప్రబోధంలోని మర్మాన్ని, రాజకీయ పండితులు, ప్రజా నాయకులు, ఈ దేశం నాదని గర్వించే ప్రతివారు విచారించాల్సినది.

ఎల్లయ్యగారి భాష వ్యవహారికం కంటే గ్రామ్యం దిక్కే ఎక్కువ మొగ్గు. కవితలు రాయాలనే తపనతో 'సాధన' చేస్తూ, సాదాసీదా వచన కవితల్లో నిజాయితీగా, నిర్భయంగా తన భావాలను ఇలా ప్రకటించిన కవి శ్రీ ఎల్లయ్య గారిని నిజంగా నేను మెచ్చుకుంటున్నాను. పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తాను.

సాహితీ ప్రియుడు
డా॥ మలయశ్రీ
తెలుగు లెక్చరర్
ప్రభుత్వ జూ॥ కళాశాల
మెట్‌పల్లి - 505 325.

''సెలవిప్పటికి - స్నేహమెప్పటికి''
15 జూలై 1998

అక్షరమే సామాజిక విప్లవం

ప్రజలంతా విద్యావంతులైతే ప్రభువుల పల్లకి మోసేదెవరు? అసలు దళితులకు, తాడితులకు, పీడితులకు చదువు ఎందుకు రాకుండాపోయింది. వీళ్లందరిని చదువుకు దూరం చేసిందెవరు? ఇవి చాలా మౌళిక ప్రశ్నలు. వర్ణధర్మ వ్యవస్థ పాపపంకిలమే ఈ దేశంలో పెరిగిన నిరక్షరాస్యత. ఈ వర్ణవాద స్వభావం గల పాలకుల కుయుక్తుల వల్లే ఇన్నేళ్ళుగా మనందరికి చదువు రాలేదు. అక్షరాస్యత తక్కువ ఉన్న దేశాలకు అప్పులు ఇవ్వమనే ప్రపంచ బ్యాంక్ షరతులు పెడితే మన పాలకులు 'తూతూ మంత్రంగా' అక్షరాస్యతా ఉద్యమం చేపట్టారు. అయినప్పటికి సంతోషమే. అక్షరానికున్న చైతన్యం అతి గొప్పది. మనిషి ఉత్త అక్షరాస్యుడైతే దండగే. దాంతోపాటు సామాజిక చైతన్యం రావాలి. ప్రశ్నించే స్వభావం పెంపొందాలి. హేతుబద్ధ జ్ఞానం అలవర్చుకోవాలి. అది అక్షరాస్యత.

సరిగ్గా ఇలాంటి అక్షరాస్యతనే ఉద్బోదిస్తున్నారు శ్రీ రుద్రవరం ఎల్లయ్య. ఈ పుస్తకం 'అక్షరశక్తి' ద్వారా చదువు ప్రాశస్త్యాన్ని తన కవితల ద్వారా వివరించారు. ఎల్లయ్యగారు ఇదివరలోనే రిజర్వేషన్లు ఎందుకు (1991) పావురాలు (1995) పుస్తకాల ద్వారా దళిత సామాజిక స్పృహ గల కవిగా సాహిత్య ప్రపంచంలో స్థానం పెంపొందించుకున్నారు. కూలినాలి చేసే వాళ్ళకు, పాలేరు పని చేసే వాళ్ళకు సమస్త కుల వృత్తుల వారికి 'చదువు' తప్పనిసరిగా అవసరమని ఆరాటపడుతూ చెప్పారు. పేదవాళ్ళ చదువు కోసం ఎల్లయ్య సారు తల్లడింపు అంతా ఇంతా కాదు. ఆయన అనారోగ్యంతో ఉంటూ కూడా ఈ నెల చివరన (ఆగస్టు 31, 1998) ఉపాధ్యాయునిగా పదవీ విరమణకు సిద్ధమవుతూ ఈ పుస్తక ప్రచురణకు చాలా శ్రమిస్తున్నారు!

సాంఘిక సమానత్వం కోసం మానవత్వంను ప్రేమించే వ్యక్తి రుద్రవరం ఎల్లయ్యగారు. ఇందులోని గేయాలు చదువరులకు వేమన గీతాల్లా సులభంగా ఉన్నాయి. ఈ **'అక్షరశక్తి'**ని అందరూ ఆదరించాల్సిన అవసరం ఈ రోజుల్లో ఉంది. ఇందులో కవితా ప్రమాణాల జోలి ప్రక్కనబెడితే 'చదువు' 'అక్షరాస్యత' అనే తాత్విక పటుత్వం ఎంతో ఉంది. నా వాళ్ళు చదువుకోవాలి, నా జనం చైతన్యవంతులు కావాలనే యావ ఎల్లయ్యగారి కడుపులో అధికంగా ఉంది. ఈరోజు వర్గాధిపత్యం, కులాధిపత్యం, లింగాధిపత్యం అలాగే ప్రాంతాధిపత్యంపై ప్రశ్నలే ప్రశ్నలు కురుస్తున్నాయి. ఇలాంటి ఆత్మగౌరవ ప్రశ్నలకు అండగానే శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారి ఈ 'అక్షరశక్తి'

ఆగస్టు 15, 1998
హుస్నాబాద్, కరీంనగర్ జిల్లా.

అన్నవరం దేవేందర్
అధ్యక్షులు, నూతన సాహితీ

''రుద్రవరం ఎల్లయ్య ప్రజా కవి''

చదువు యొక్క గొప్పతనాన్ని చాలా గొప్పగా చెప్పిన మన పూర్వీకులు కొన్ని జాతుల వారిని విద్యకు నోచుకోకుండా చేసినారు. ఈ దేశానికి స్వతంత్రమచ్చిన, ఇన్ని సంవత్సరములైన పూర్వీకుల దుష్ట శాసనం వల్ల ఇంకా ఆ పేద జాతుల వారు సంపూర్ణ విముక్తి చెందలేకపోతున్నారు.

ప్రభుత్వం పక్షాన ''చదువే అందరిని ఉన్నత స్థితికి తెస్తుందని'' చదువుకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది. ఇట్టి సమయంలో శ్రీ ఎల్లయ్యగారు **''అక్షరశక్తి''** అను గేయ సంపుటం ప్రచురించటం ఎంతో మంచి పనిగా వారిని అభినందిస్తున్నాను.

నాకు తెలిసినంతవరకు ఎల్లయ్యగారి గ్రంథములన్నీ సమకాలిక సమస్యలపైననే వ్రాయబడినవి. అందుకే వారిని ''ప్రజా కవి'' అని పేర్కొంటున్నాను. ఇకముందు మరిన్ని మంచి పుస్తకములు వ్రాయాలని ఆశిస్తున్నాను.

హుస్నాబాద్
30-7-98

దేశిని చినమల్లయ్య
ఎం. ఎల్. ఏ.
ఇందుర్తి శాసన సభ నియోజక వర్గము

''ప్రజల కొరకు కలం పట్టిన కవి''

ప్రాచీన కులపతులు సమాజమును శాసించినారు. అసలు పాలకులే వారనిన తప్పు కాదు. సమాజములోని కొందరు నీచులని, వారు చదువు నేర్వవద్దని ఆదేశించినారు. ఏదైతేనేమి నాటికీ, నేటికి మనలో చాలామంది చదువు రానివారు ఉన్నారు. పాఠశాలలు, కళాశాలలు నేడు ఎన్ని ఉన్న అందరు చదువుట లేదు. చదువు రానివారి కొరకు **''అక్షర ఉజ్జ్వల''** కార్యక్రమం అమలులో ఉంది. దానికి అనుగుణంగా వయోజనులకు ఉపయుక్తంగా శ్రీ ఎల్లయ్య **''అక్షరశక్తి''** అను ఒక కావ్యం వ్రాయడం చాలా సంతోషం.

వీరి కవిత పలుకులు ఒక సవాలుగా ఉపదేశం చేసినట్టుగా ఉంటవి. ఉన్నది ఉన్నట్టు చెప్పే కవి. అందుకు నిదర్శనం **''రిజర్వేషను లెందుకు?''** వీరి **'పావురాలు'** కు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం చేసింది.

నిదానస్తుడైన ఎల్లయ్యగారు ఆయురారోగ్యములు కలిగి, మరిన్ని మంచి పుస్తకములు వ్రాయాలని ఆశిస్తున్నాను.

హుస్నాబాద్
31-7-98

కోమటి రాజవీరు
యం.పి.పి., హుస్నాబాద్.

''అభినందన సందేశము''

శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారు ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘమైన సేవ చేసి తాను పదవి విరమణ చేయనున్న తరుణంలో రూపొందించిన కవితా పుస్తకం ''అక్షర శక్తి''

కవితా రచనలో కొంత అనుభవాల్ని గడించిన శ్రీ రుద్రవరం ఎల్లయ్య గారు తన అనుభవసారాన్ని ఈ పుస్తక రూపంలో పాఠకులకు అందజేస్తున్నారనుటలో ఎలాంటి సందేహం లేదు.

భావావేశంతో కొనసాగిన ఈయన కవితలు పాఠకుల మనోభావాలను ప్రభావితం చేస్తాయని, వీరు తమ పదవీ విరమణ అనంతరం కూడా సాహిత్య సేవలో భాగంగా ఆసక్తికర అంశాలను కవితలుగా మలచి పాఠక లోకానికి అందచేయాలని ఆకాంక్షిస్తూ ప్రస్తుత రచనకు శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారిని మనసారా అభినందిస్తున్నాను.

మట్ట రాజిరెడ్డి
ZPTC, (కరీంనగర్) హుస్నాబాద్



జన జీవన చైతన్యం 'అక్షరశక్తి'

భారతీయ సమాజానికి నిరక్షరాస్యత ఒక తలవంపు. అక్షరాస్యత చైతన్యానికి ప్రతీక. అక్షరశక్తి మనిషికి జ్ఞానాన్ని, ప్రశ్నించే హేతుబద్ధతను పెంపొందిస్తుంది. అంతేగాక అక్షర చైతన్యమే సామాజిక ఆలోచనా విధానాన్ని, పరిసరాల పరిజ్ఞానాన్ని విరబూయిస్తుంది. ఇందుకు సాధికారికంగా శ్రీ రుద్రవరం ఎల్లయ్య 'అక్షరశక్తి' అందిస్తున్నారు.

రుద్రవరం ఎల్లయ్యగారు గతంలో 'రిజర్వేషన్లెందుకు?' 'పావురాలు' అనే గేయ సంపుటాలు ప్రచురించి సాహిత్య ప్రపంచంలో ప్రఖ్యాతి గాంచారు. రిజర్వేషన్లు ఎందుకు అనే గ్రంథం రిజర్వేషను వ్యతిరేకులను కలవరపరిచింది. ఈ కలవారి కలవరపాటును తట్టుకొని ఎల్లయ్యగారు దళిత, బలహీన వర్గాల వారి కోసం 'అక్షరశక్తి' ప్రచురించడం చాలా సంతోషం! ఇది చాలా మంచి పుస్తకం శ్రీ ఎల్లయ్యగారు అనుభవజ్ఞుడైన ఆదర్శ ఉపధ్యాయుడే గాకుండా ప్రవృత్తి రీత్యా సామాజిక కళాపిపాసి! కలం వీరుడు. ఆయన నిరంతరం కవిత్వం వ్రాస్తూనే వుంటారు. ఆయన కృషి సాహిత్య సేవ అభినందనీయం.

''రోత బతుకు వద్దంటే రాత నీవు నేర్వాలి
గరీబుతనం పోవాలంటే గ్రంథాలెన్నో చదవాలి''

''దొరకొడుకు బడికి వెళ్ళి దొర ఆయెను చూడు
నీ కొడుకు పశువులు కాసి పాలేరు ఆయెను చూడు''

అంటూ చాలా సులభంగా జనాన్ని జాగృతం చేస్తున్నారు. ఈ ఆదర్శనీయుని కలం నుంచి మరిన్ని కవితలు జాలువారాలని ఆశిస్తూ.......

సుద్దాల చంద్రయ్య
బి. యస్‌సి. (వ్యయ)
మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మం. ప. సైదాపూర్, కరీంనగర్ జిల్లా.

తేది 10 ఆగస్టు 1998
హుస్నాబాద్.



కాసిన్ని తీపి గుటికలు

నా జీవిత రాజ్యాంగ రచయిత నా అమ్మమ్మ సాయమ్మకు..........
నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు..........
పాలిచ్చి పెంచిన పెద్దమ్మ బోయిని రాజమ్మకు...........
నన్ను ''ధర్మరాజు'' అని పిలుచుకొన్న నా చిన్నమ్మ ఆరెపెల్లి అయిలమ్మకు..........
నాలుగవ తరగతి చదువే నన్ను దయతో చూసి నా అమ్మమ్మను బడికి పిలిపించుకొని, తల్లీ నీ మనుమునికి చదువు మీద చాలా శ్రద్ధ ఉంది. పేదదాన్నని చదువు మాన్పించకు, అని చెప్పి నా ఈ స్థితికి కారకుడైన నా చిన్ననాటి గురుదేవులు కీ॥శే॥ ఫకీర్‌మహ్మద్, ఎలబోతారం గ్రామం హుజురాబాద్ గారికి.........
1961-63లో నా ఉపన్యాసములకు, నాటికలలో పాత్ర పోషణకు, ముగ్ధుడై నాలో కవితావేశముందని, కవితలు, నవలలు వ్రాయమని గురువుగా ఆదేశించిన (ప్రముఖ రచయిత) శ్రీ తాడిగిరి పోతరాజు, హుజురాబాద్ గారికి.........
నా మొదటి కవితా సంపుటి ''రిజర్వేషన్ లెందుకు?'' ఆవిష్కరించిన మాజీ మంత్రి శ్రీ సుద్దాల దేవయ్యగారికి, ఆ సభలో నన్ను సన్మానించిన అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీ భన్వర్‌లాల్ ఐ.ఏ.ఎస్. గారికి..........
నా రెండవ కృతి ''పావురాలు'' అచ్చుకై ఆర్థిక సహాయం చేసిన తెలుగు విశ్వవిద్యాలయం వారికి మరియు అప్పటి వైస్-చాన్సలర్ పేర్వారం జగన్నాథం గారికి....
''దేశసమైక్యత - సమగ్రతలో యువకుల పాత్ర'' అను వ్యాసాన్ని రాష్ట్రస్థాయి బహుమతికి ఎంపిక చేసిన పసులేటి శ్రీనివాసరావు (ఆంధ్రభూమి) గారికి.........
అన్నపూర్ణ సినీ స్టూడియోలో 10-07-1996న శ్రీ అక్కినేని నాగేశ్వర్‌రావు గారి సమక్షములో తన చేతుల మీదుగా నాకు జ్ఞాపికను అందచేసిన ప్రముఖ సినీ హీరో శ్రీ అక్కినేని నాగార్జున గారికి........
నా ఈ కృతిని అచ్చు వేయించుటకు ప్రోత్సహించి, ప్రింటింగ్ ప్రెస్ వారికి హుస్నాబాద్ క్లబ్ ద్వారా ముందుగా 1500/- రూ॥లు అందచేసిన శ్రీ సుద్దాల చంద్రయ్య, శ్రీ కెడెం లింగమూర్తి గార్లకు.........
హుస్నాబాద్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులకు, సర్వసభ్యులకు పేరు, పేరున ....
నా రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ మిత్రులకు...........
సాహితీ మిత్రులు-డా॥ మలయశ్రీ, రజనిశ్రీ, అన్నవరం దేవేందర్, రేబల్లి వెంకటేశ్వర్లు, వడ్డెపల్లి మల్లేశం, బి.ఎస్. రాములు, కె. విశ్వనాథం, కె. శ్రీహరి, ఫజుల్‌రహ్మాన్, పి. సత్యనారాయణ, ఏ. లక్ష్మయ్య గార్లకు............
అర్థవంతంగా, కళాత్మకంగా ముఖ చిత్రమును అందించిన ఆర్టిస్ట్ శ్రీ అన్నవరం శ్రీనివాస్ గారికి.....
సందేశములిచ్చిన పెద్దలందరికి మరియు ఈ పుస్తకమును అందముగా ముద్రించి, సకాలములో అందించిన శ్రీ శ్రీమంతుల నరేందర్ తిరుమల ప్రింటర్స్, హుస్నాబాద్ గారికి...........
నా జీవిత కాలపు తోడు కమలకు, ఆత్మీయులు, మేనమామలు, బంధు - మిత్రులు, అమృత హృదయులు ఎందరో అందరికి.........
కృతజ్ఞతలు చెప్పి తక్కువ చేస్తానా? తలుచుకుంటూ, తలపుల్లో దాచుకుంటాను గాని............

రుద్రవరం ఎల్లయ్య

''చదువే చల్లని తల్లి''

ఉపాధ్యాయుడు శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారి మూడవ కావ్యం 'అక్షరశక్తి' వెలువడుట చాలా హర్షదాయకం! ఉపాధ్యాయుడు తన అనుభవమును జోడించి 'అక్షరశక్తి' అను పుస్తకమును వయోజనులకు చాలా ఉపయోగపడునట్లు వ్రాసినారు. వీరి రెండవ కృతి 'పావురాలు' కు తెలుగు విశ్వవిద్యాలయం వారు అచ్చుకై ఆర్థిక సహాయం చేయడం వీరి సాహితీ కృషికి నిదర్శనం!

సర్వాంతర్యామి శ్రీ ఎల్లయ్యగారిని సాహితీ సేవలో మరింత ముందుకు నడిపించాలని ఆశీర్వదిస్తున్నాను.

హుస్నాబాద్
03-6-1998

ఏ. సత్యనారాయణరావు
డి.ఇ.ఒ. కరీంనగర్.

''కవిత్వం కూడా దేశ సేవయే!''

శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారి యొక్క 'అక్షరశక్తి' గేయ సంపుటి అన్ని వర్గాల వయోజనులకు చాలా ఉపయోగకరంగా ఉంది. కవి శ్రీ ఎల్లయ్యగారు తన సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో, విద్య బోధన అనుభవముతో కార్మిక, కర్షక, స్త్రీ జన, బడుగు, బలహీన వర్గ ప్రజలకు విద్య యొక్క అవసరత, విద్య ప్రాముఖ్యతను గురించి చాలా చక్కగా తెలియపరిచారు.

ప్రభుత్వం చేపట్టిన ''అక్షర ఉజ్వల'' కార్యక్రమానికి వీరి 'అక్షరశక్తి' అనుబంధంగా ఉపయోగపడగలదని, వీరి సాహితీ సేవ కూడా దేశ సేవయే అనుటకు సంతోషిస్తున్నాను.

శ్రీ రుద్రవరం ఎల్లయ్యగారికి దేవుడు సదా తోడుగా ఉండి, సాహితీ సేవలో ముందుకు నడిపించుగాక అని ఆశిస్తున్నాను.

హుస్నాబాద్
18-7-1998

దడిగెల రామారావు
యం.పి.డి.ఒ. హుస్నాబాద్.

''నిరంతర విద్యా బోధకుడు ఎల్లయ్యగారు''

చిరకాల ఉపాధ్యాయ మిత్రుడు శ్రీ ఎల్లయ్యగారి మూడవ కృతి 'అక్షరశక్తి' చాలా బాగుంది. తన కవితా పాండిత్యానికి, తన బోధన అనుభవమును జోడించి ఆర్థిక, సాంఘిక, బడుగు బలహీనులకు, స్త్రీలకు విద్యయొక్క విలువను చక్కగా విశదపరిచినారు.

విద్యాదానం చేయుట పుణ్యకార్యం. ఇట్టి పుణ్యకార్యం చేసిన ఆర్. ఎల్లయ్యగారు నిరంతర విద్యాబోధకుడని అభినందిస్తున్నాను.

దైవం ఇతనికి తోడై ఉండి, ఆయురారోగ్యములనిచ్చి మరిన్ని మంచి కావ్యములు వ్రాయుటకు ఆశీర్వదించాలని ఆశిస్తున్నాను.

హుస్నాబాద్
23-7-1998

మాగంటి చందర్‌రావు
యం.ఇ.ఒ., హుస్నాబాద్.

అంకితం



నా చిన్నమ్మ ఆరెపల్లి అయిలమ్మకు
భాష్పాంజలితో . . .

మాతృభక్తి పారాయణుడు

అమ్మనమ్మ మాట జవదాటని మాతృభక్తి పారాయణుడు. ఆమె మాట ప్రకారమే జీవిస్తున్న త్యాగమూర్తి. ఏ అంతర్వాణి ఎల్లయ్య ను కవిని చేసిందో ఎవరికి తెలుసు?

మొదట ప్రేమ కథలు, శృంగార కావ్యములు వ్రాసే అన్న ఎల్లయ్యగారు కుల నిర్మూలన, తన ధ్యేయమన్నట్లు 'రిజర్వేషను లెందుకు?' అనే గేయ సంపుటి వ్రాసిండు. సమాజ శ్రేయస్సేధ్యేయమన్నట్లు ''పావురాలు'' వ్రాసి పండితుల మన్ననలకు పాత్రుడు అయిండు. నిరక్షరాస్యత నిర్మూలనకై ఈ 'అక్షరశక్తి' వ్రాసినారు.

చీమకు కూడా అన్యాయం చేయని శాంతమూర్తి ఎల్లయ్య గారు, ఇంత కవితావేశం కలిగుండటం ఆశ్చర్యం! చైతన్యం కాంక్షిస్తున్న ధీరోదాత్తుడని శ్లాఘిస్తూ, వారికి, వదినమ్మకు వారి పిల్లలకు దేవుడు సదా తోడై ఉండాలని కోరుకొంటున్నాను.

కరీంనగర్
10-8-98

జ్ఞాని ఎ. లక్ష్మయ్య
సీనియర్ అసిస్టెంట్
జడ్.పి. కార్యాలయం

'అక్షరశక్తి'
విషయ సూచిక

అమృతపు జల్లు చల్లని తల్లి ! 1

ఆకాశ మమృత మిచ్చు
తరువు ఫలము లిచ్చు
బుధుడు బుద్ధి నిచ్చు
చదువు సకల మిచ్చు

జ్ఞానమును కలిగిస్తుంది
ఆలోచనల పెంచుతుంది
మనిషికి మరో జన్మనిస్తుంది
చదువే మన చల్లని తల్లి !

మాంద్యమును తొలిగిస్తుంది
చిత్తవికాసమును కలిగిస్తుంది
విశ్వవిజ్ఞానమును పెంచుతుంది
కీర్తి సంపదల కలిగిస్తుంది

విజ్ఞానమును పెంచు
దారిద్ర్యమును త్రుంచు
ఆపదలనుండి కాచు
అందరి తల్లి చదువు

పేద, వెడ్డి బ్రతుకుల నుద్ధరించు
బడుగు బానిసల స్థితి బాగుచేయు
దోచెడి స్వార్థపరులనుండి కాచు
చదువు నేర్వుడి పేద బడుగులందరు

వెట్టి చాకిరి చేసేందుకుండాలి
పది మంది కొడుకు లానాడు
చక్కగా బ్రతికేందుకు నేడు
చాలు ఇద్దరని తెల్వ, నేర్వు చదువు

ప్రపంచ దేశాలలో
అక్షరాస్యుల సంఖ్య
పెరుగుతున్నది గొప్పగా
కాని మన దేశాన లేదు
చదువు - ఎదుగు

మనందరి సమిష్టి
బాధ్యతా లోపం
పేదరికపు జాఢ్యం
కుల మూర్ఖపు కంపు
తొలగిపోవు దేశం - పొలిమేర దాటి
చదువు నేర్చినందరు - సర్గమే దేశమై !

చదువు నేర్చిన తమ్ముళ్లు
చదువు నేర్చిన చెల్లెలు
చదువు రాని జడులకు
చదువు నేర్పుడి, అదే దేశ సేవ!

గోదానము, భూదానము,
అన్నదానము, వస్త్ర దానము
అన్ని దానములు చేసినట్లే
విద్య దానము మీరు చేసిన

రోత బతుకు వద్దంటే
రాత పూతలు నేర్వాలే
గరీబుతనం పోవాలంటే
గ్రంథములు చదువాలే!

చీకటికి చందమామ
ఆకటికి అన్నం ముద్ద
అభాగ్యులకు అక్షర విద్య
వెలుగు నిచ్చు - విలువ తెచ్చు

ఉప్పులేని పప్పు చదువులేని వారు

2

ఉప్పులేని పప్పు
ఒప్పదు రుచులకు
చదువు లేని వారు
చవక అవుతారు

చదువు రాని మనిషి
గుడ్డి బాటసారి
నడుచు నెట్లోకాని
బ్రతుకంత చీకటి !

చదువు రాని బ్రతుకు
అమవాస్య చీకటి,
చదువు వచ్చిన బ్రతుకు
నిండు పున్నమి వెన్నెల !

వట్టివాడవు కావు
గట్టివాడవు నీవు
మోటువాడవు కావు
చక్కనోడివి నీవు
చదువుకుంటేనే మరి !

చదువు నేర్చిన నీకు తెలుసు
నాటినుండి నేటికి
నిన్ను పీడిస్తున్నవి రెండు
నిరక్షరాస్యత, పేదతనములవి

నిరక్షరాస్యతకు - పేదతనము
పేదతనానికి - నిరక్షరాస్యత
కారణములని తెలుసుకో
అవి పోవాలంటే చదువుకో

సొంగ తాగి సొమ్మసిల్లకు
కల్లు తాగి కక్కుకొనకు
బాంచె బతుకని బాధపడకు
చదువు నేర్చిన బాగుపడుదువు

కల్లు సారాలు మాని మీరు
చదువు చక్కగా నేర్చుకోండి
అక్షర విద్యను నేర్చి మీరు
మీ బ్రతుకు బాగుచేసుకోండి

సమత లేని స్వేచ్ఛ స్వేచ్ఛ లేని సమత 3

సమత లేని స్వేచ్ఛ
స్వేచ్ఛ లేని సమత
కలిమి బలిమిల కంపు
దేశానికి తలవంపు

మీరందరు చదువు నేర్చిన
మీకు కలిమి బలిమి కలుగు
దేశగౌరవం పెరుగు
సర్వేజన సుఖినో భవంతు !

దొరలు పులులు
తొత్తులు నక్కలు
చదువు రాని పేదలు
నేటికి బలి పశువులు

చాకిరేవు చాలనకు
రోడ్లూడ్చుటే మేలనకు
చర్మశుద్ధి బాగనకు
చదువు నేర్చితేనే సౌఖ్యము

పులి దెబ్బకు, నక్క మోసానికి
కూలు మూగ జీవివి,
చదువు నేర్చిన నాడు
తొడగొట్టి వాటిని పడగొట్టు
వీర సింగంబు - నీవు.

ఇల్లు నీకు లేకున్న
చేను చెలుక లేకున్న
చదువు చక్కగా నేర్చుకొన్న
సర్కారు బిడ్డవే నీవు

ఢిల్లీలో కులములున్నవి
లండన్‌లో పేదలున్నారు
లేదు ప్రగతి పేదలకు
చదువుతోనే పేదల ప్రగతి

జన్మ ఫలము ఖర్మ ఫలమని
జడుని భావమెందుకు?
చదువు సందెలు నేర్చి మీరు
ప్రగతి పథము అందుకొనుడి

4

లెక్కలేని వారమని మిక్కిలేడ్చుటెందుకు?

పేదవారు మీరైతే
చదువు తప్పక నేర్వుడి
చదువు నేర్చి మీరు కండి
జ్ఞానులు - ధనవంతులు

దాతలు నాయకులు
మీ తలరాత మార్చరు
మీరంతా చదువుకోండి
మీ రాతలు మార్చుకోండి

వాళ్ళు వీళ్ళు ఏమి ఇచ్చినా
మీ బ్రతుకులు బాగుపడవు
దిక్కుమాలిన మీ బ్రతుకులు
చదువుకుంటేనే బాగుపడును

ఎవ్వరిచ్చినా తక్కువే
ఎంతిచ్చినా తక్కువే
చదువే మీ తరగని ధనం!
అందుకే చదువు నేర్చుకోండి

రోషగాళ్ళు - వేషగాళ్ళు
మతం ముసుగు మోసగాళ్ళు
గమ్మత్తుల స్వార్థగొండ్లు
నిన్ను మోసగించలేరు
నీవు చదువు నేర్చుకొన్న

నాగరికత కన్న ముందు
స్వార్థం పరుగిడుతుంది
అక్షర జ్ఞానం లేని మీరు
ఓడిపోయిన - బడుగు జీవులు

బొమ్మవిద్దెలు పేదవారికి
బ్రహ్మవిద్యలు ధనం కలవారికి
ధనము కులములున్నవారే
నాడు నేడు గొప్పవారు !

పాత రోతల - నేటివేతల
పారదోలుడి - నేడు మీరు
గొప్ప విద్యలు నేర్చి మీరు
గొప్పస్థాయికెదుగుడి !

పల్లెటూళ్ళలో కష్టజీవులు
కన్న తల్లి వున్న ఊరని నమ్మి
బావిలోని కప్పలు - పుట్టి బానిసలు
బస్తీకెళ్ళితే మీరు గుడ్డి వెడ్డి వెలుగని దీపాలు

కాయకష్టం చేసితేమి?
ఘర్మ జలమును కార్చితేమి?
మీరంత ఎడ్డోళ్ళని గదా?
మీదోళ్ళకు మీరంటే నిర్లక్ష్యం

అందరి వలె మీరు కూడ
ధన, విద్యావంతులైతే
మీ బతుకుకు, మెతుకులకై
మీ బిడ్డల బతుకులకై
మీరు అలమటింతురా!

ఏడ్వకండి - ఏడ్వకండి
పలుక బలుపం చేతబట్టి
అక్షరాలు నేర్వండి
లక్షణంగా బ్రతుకండి !

5 ఉద్ధరించవు రిజర్వేషనులు దిద్దనేర్చుకో అక్షరాలు

చదువు జ్ఞానం లేని మీరు
ఆస్తిలేని బడుగు జీవులు
రిజర్వేషన్ రొట్టె కొరకు
మ్యావ్ మ్యావ్ పిల్లులు

మనిషి విలువను - మంచి చెడులను
ప్రజాస్వామ్యమును - పౌరహక్కులను
తెలియ నేర్పును - చదువు మీకు
చదువు నేర్చుకొనుడి - రిజర్వేషన్ పోరుమాన

ఆస్తి భూములు సకల సంపదలు
చికెన్ బిర్యాని విందు దొరలకు
పీకివేసిన కోడి ఈకెలు
రిజర్వేషనులు - మీ పేదలకు

కుల నీచము దొరలది
మతం మాయ మనువుది
చదువు నేర్చిన సరిగ తెలుసు
మేడి పండు విప్పినట్లు

దొరకొడుకు బడికి వెళ్ళి
దొర అయ్యేను చూడుము
నీ కొడుకు పశువుల కాసి
పాలేరు అయ్యేను చూడుము

ఈ సత్యమొకటి
సరియని తెలుసుకొని
చదువ పంపుము
నీ కొడుకును బడికి!

చదువు విలువ గుర్తించి
సంసారం దిద్దుకొనండి
ఇంటివారు అందరూ చదివి
బ్రతుకు బాగు చేసుకొనుడి

ఓ బడుగు జనులారా !
మ్యావ్ మ్యావ్‌లు మానండి
చదువు లేకనే చెడిపోతిరి
చక్కగా చదువుకొని సత్తాను పెంచుకొనండి

కాకి, చీమల చూచి మీరు
స్నేహభావము నేర్చుకోండి
నీ వలె నీ సాటివాడిని
బాగుపడి, బ్రతకనీయుడి.

ఐక్యమత్యం
స్వార్థ త్యాగం
లేక పిల్లులు
చెడిపోయెను కద

చదువుల సారం
స్వార్థ త్యాగం
సమిష్టి మార్గం
జగమే స్వర్గం

పలుకా బలుపం పట్టి
కాగితంపై కలం పెట్టి
చదువుకో శక్తి కలుగు
సంపదలు నీకు పెరుగు

నా ఆడబిడ్డా నేర్చుకో – చదువు

6

ఆడ మగ తేడా లేదు
చదువు నేర్చుకో నా బిడ్డా !
ఇల్లునే కాదు ఓయమ్మా
ఢిల్లీ నేలు నీవేమి తక్కువ?

ప్రేమకు పెండ్లికి నేడు
అవిద్య అవుతుంది అడ్డు
ప్రేమ వివాహాలకు నేడు
విద్య అవుతుంది ముద్దు

ఏమి చదివింది?
అని అడుగుచున్నారు
పెండ్లికి ప్రేమకు
తొలిముద్దు విద్య

అందుకే చదువు
నేర్చుకో నా బిడ్డా!
కాలానికి సరితూగు
బేలవు కాకు, చిన్నతనము పొందకు

చదువొస్తే చాలు
తెలివి బుద్ధి పెరుగుతుంది
సాంఘిక, చైతన్య మబ్బుతుంది
ఆర్థిక స్వేచ్ఛ లభించుతుంది

కొడవలి పట్టిన కోమలి
పలుక బలుపం పట్టు
పంట చేనుల ఇంటి పనిలో
వెలుగు దివ్వెవు కమ్మ!

అబ్బాయి చదువు
బయటికే వెలుగు
అమ్మాయి చదువు
ఇంటా - బయటా వెలుగు

బి.ఏ. చదివిన బిడ్డను
బియ్యంలో రాళ్ళు వేరెయ్యమంటూ
అమ్మాయిని చిన్నబుచ్చకు తండ్రీ!
అమ్మాయి పెండ్లికి ఆరాట పడకండి

ఆడపిల్ల అని నిరాదరణతో
చిన్న చూపు చూడకు తండ్రీ!
గొప్ప విద్యలు చదివించి అబలను
సబలను చేయుము తండ్రీ!

కొడుకును బిడ్డను
రెండు కండ్లని భావించు
అప్పుడే నీ బిడ్డ మీద నీకు
మమతానురాగమున్నట్లు గుర్తు

కొడుకును బిడ్డను
ఏకరీతిని చూడండి
భరత భూమిని మరో
రూప్‌కన్వర్‌గా కాల్చకండి
వరకట్నపు మంటలను
రావణ కాష్టం - చేయకండి
భరతఖండపు అపఖ్యాతిని
భస్మీపటలం చేసెయ్యండి

ఆడపిల్లలను
స్వశక్తిపరుల జేసి
వరకట్నపు మంటలను
ఆర్పేయండి తుదముట్ట

7 పుట్టు పేదరికము కట్టు బానిసత్వము

పుట్టు పేదరికము
కట్టు బానిసత్వము
ఎందుకున్నాయి మీకు?
చదువుకొన్న అది తెలుసు మీకు

పొలము నీకు లేదు
పశువులు నీవి కావు
ఉట్టి పాలేరువు నీవు
చదువు నేర్చిన నాడు
నువ్వు కామందువు

కూరగాయ వైద్యము
కూని, కూని రాగము
రాని వారు లేరు
చదువుకుంటే నీకు కూడా
చదువు వచ్చు తమ్ముడా !

లక్ష్మి కొందరి అబ్బ సొమ్ము
చదువు అందరి సొంత సొమ్ము
అని గ్రహించి చదువుకో
అభివృద్ధిని సాధించుకో

బతుకు లేని వాళ్ళు
బతుక లేని వాళ్ళు
బతుకు బాధల వాళ్ళు
బతుక నేర్వాలంటే - చదువు

తీరిక కూర్చుకొని
చదువు నేర్చుకోండి
బతుకు మార్చుకోండి
బాధలు తీర్చుకోండి

బర్రె - వీపు పలుక
కర్రబొగ్గు - బలుపం
బుద్ధి మీకు గురువు
శ్రద్ధయే మీ విద్య

అన్యాయాలు పోవాలంటే
దౌర్జన్యాలు నశించాలంటే
అలమటించే మీరంతా
అక్షర విద్యలు నేర్వాలె!

గన్ను బాంబుల కన్న
చదువు పెన్ను గొప్ప
పుస్తకం చదివితే నీవు గొప్ప !
స్వార్థపరుల తిక్క తుప్ప

హక్కులడిగే మీరు
అక్షరాలు నేర్చుకోండి
సమ్మె చేయాలనుకుంటే
చదువు ముందు నేర్వండి

పసుల కాచేటోళ్ళు
పొలము దున్నేటోళ్ళు
చాలా చాలా గరీబోళ్ళు
చదువుకుంటే చాలా మేలు !

రెక్కల కష్టం దక్కాలంటే
బుక్కెడు బువ్వ దొరకాలంటే
మీ ఇల్లు బాగు పడాలంటే
మీరు, మీ పిల్లలు చదువుకోండి

ఆనాడు పంచములు
ఈ నాడు హరిజనులు
ఆనాడు - ఈనాడు
మాదిగలు మరీ నీచులట !

నీచులను వారంత చదువుకొంటే
నీచ హృదయులంత హరించిపోవుదురు
రావు, రెడ్లు, మాదిగ, మాల కులములుండవు
ఏ భేదములుండవు - ఏ విభేధములుండవు

భయపెట్టె బాంబు కన్నా
బలమైనది అక్షర విద్య
అక్షర శక్తి యెస్సీల కున్న
రిజర్వేషను రొట్టె ఎందుకు?

కుల ధర్మం కుళ్ళు
ధన ధర్మం స్వార్థం
చదువస్తే తెలుసు
ఎవరిది ఎంత స్వార్థమో

అణగారిన జనులంతా
అక్షర విద్య నేర్చినంత
కుల ధనాంధులంతా
రెక్కలు తెగిన రాబంధులవుదురు

రిజర్వేషను మూల మంత్రం
స్వార్థపరుల కుతంత్రం
కులమత మూర్ఖ తంత్రం
చదువుకుంటేనే నీకు తెలియు

రిజర్వేషను భిక్షముతో
పోదుమీదు దరిద్రము
గోబెల్స్ నీతిగాళ్ళ స్వార్థమును
చదువు నేర్చి - తూడ్చి పెట్టుము

8 కులనాగు కోరలూడు

కసరి బుసకొట్టును
కులనాగు నిన్ను జూసి
నీవు చదువు నేర్చిన
కోరలూడి తలవంచు

మతము మాయను
కులము రొచ్చును
స్వార్థపరుల మోసమును
చదువు నేర్చి జయించు నీవు !

చదువు కోని నీ తమ్ములు
సాగ లేక నలుగుతున్నరు,
ధనం, కులం దగాలకు
దళితుడనే చిన్నచూపుకు

చిన్నారెడ్డి, పాపారావు,
పెద్దిశెట్టి, రామశర్మ
మనుషులుగా మిము చూడరు
అది ఎందుకో తెలుసా?

భుజబలం, బుద్ధి బలం
మంచితనం ఉండి మీరు
చదువు సంపద - ఆస్తిపాస్తులు
లేనందుకే నలుగుచున్నారు

ఏడ్వకండి - ఏడ్వకండి
పలక బలపం, చేతబట్టి
లక్షణంగ చదువుకొండి
అప్పుడే ఆస్తి పాస్తులు మీ హస్తగతం

గాంధీ, ఇందిర కాలనీలు
ఊరి బయట మీ ఇండ్లు
నాయకులను గౌరవించే
దేశ భక్తులు మీరంతా

చదువు నేర్చుకొనుడి మీరు
విముక్తి మార్గము మీకు దొరుకు
స్వశక్తిపరులు మీరవుదురు
సామరస్యపు సమసమాజమందుకొందురు

సత్యం – తత్వం మీకు తెలుసు

9

ఉన్నదంత వట్టిదే
లేనిదేమి లేదు
తత్వమనేదేమిటో
చదువుకొంటే మీకు తెలుసు

జన్మ ఫలం మీదనే
జడ భావమెందుకు?
చదువు నేర్చి జ్ఞానులై
దీప్తి శక్తి చూపుడి !

ఆవేశాన్ని తొలగిస్తుంది
చైతన్యాన్ని కలిగిస్తుంది
శాంతిని నీలో నింపుతుంది
స్థిత ప్రజ్ఞున్ని చేస్తుంది !
నీవు అక్షర విద్య నేర్చినంత !

దేశ జనులంత
అక్షర విద్య కలిగుంటే
దేశమంతటా
సుఖశాంతులు వెల్లివిరియు

మూర్ఖ హృదయాలను సాధిస్తుంది
కుల ధనాందుల కుళ్ళు విప్పుతుంది
గర్విష్టుల గర్వాన్ని ఎండగడుతుంది
మానవత్వాన్ని ప్రబోధిస్తుంది - అక్షర విద్య !

విశ్వ విజ్ఞానం విస్తరిస్తుంది
పచ్చి మూర్ఖత్వం పటాపంచలవుతుంది
సూర్యతేజంతో నిండుతుంది
అక్షర విద్య నేర్చినంత ! నీ బ్రతుకు

నీవు చదువుకొంటే
ఉదయిస్తున్న సూర్యుడవు
నీవు చదువు నేర్వకుంటే
నీ బ్రతుకు సూర్యాస్తమయం !

పూజించే చేతులు
స్వార్థ పంకిలములు
కష్టించే చేతులు
సృష్టికర్త హస్తములు

'అక్షరశక్తి' కలిగున్న
సత్య - తత్వములు తెలియు
స్థిత ప్రజ్ఞులు - సుపర్‌మేన్‌లు
మీరు అవుదురు, పేదలారా!

మీరు చదువు నేర్చుకుంటే
మీకుండవు కన్నీళ్ళు, కష్టములు
మీ ఇల్లు నందనవనం
మీ పిల్లలు తేజోమూర్తులు !

''ఇది కవిశ్రీ
రుద్రవరం ఎల్లయ్య
విరచితగేయ మాలిక
అక్షర శక్తి''

'సమాప్తం



పేరు	:	**ఆర్. ఎల్లయ్య**
తండ్రి పేరు	:	శ్రీ దుర్గయ్య
స్వస్థలం	:	రాయికల్ సైదాపూర్ మండల్
విద్యార్హతలు	:	బి.ఏ.,బి.ఇడి.
జన్మతేది	:	05–08–1940
ఉద్యోగంలో చేరిన తేది	:	09–09–1965
ఉద్యోగ విరమణ తేది	:	31–08–1998



పనిచేసిన పాఠశాలలు :

(UPS) మహదేవ్‌పూర్ మండలంలో	09–09–1965	–	24–11–1974
ZPSS కమలాపూర్	25–11–1974	–	07–11–1977
ZPSS వంగర	08–11–1977	–	02–08–1984
ZPSS హుస్నాబాద్	03–08–1984	–	31–12–1991
ZPSS (బాలికలు)	01–01–1992	–	31–12–1996
(UPS) గౌరవెల్లి-హుస్నాబాద్	01–01–1997	–	31–08–1998

ఘోర ప్రమాదం :

పార్లమెంట్ ఎన్నికల విధి నిర్వహణలో తేది. 15-5-1991 ఆరునెలలు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతూ అంపశయ్య జీవితం!

అభిరుచులు :

విద్యార్థి దశలో నటుడు, వక్త - నేడు గ్రంథ పఠనం, రచనలు చేయటం.

అవార్డులు - బిరుదులు :

1. దేశ సమైక్యత వ్యాసానికి సినీ హీరో నాగార్జున చేతుల మీదుగా జ్ఞాపిక (10-7-1996) (అన్నపూర్ణ సినీ స్టూడియో, హైద్రాబాద్‌లో)
2. గ్రామీణ కళాజ్యోతి అవార్డు 21-11-1995
3. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 05-09-1997

కవిశ్రీ, వరకవి, ప్రజాకవి, కలం వీరుడు, సామాజిక కళాపిపాసి.

ప్రచురణలు : రిజర్వేషనులెందుకు?, పావురాలు, అక్షరశక్తి.

చిరునామా : **ఆర్. ఎల్లయ్య** (రిటైర్డ్ టీచర్)
సాయమ్మ నిలయం, ఇ.నెం. 17-83/2,
హుస్నాబాద్ - 505 467, జిల్లా : కరీంనగర్

Title Design : Annavaram Sreenivas
Compsing by : 'ParameshwarA'